క్లుప్తంగా

రేపు ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం

నయీంనగర్: వాయుపుత్ర ధ్యాన మందిరం కాపువాడ ఆధ్వర్యంలో ఆదివారం ఒకరోజు ఉచిత ధ్యాన శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కె.రామ్మూర్తి, ఎం.రవీందర్ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉదయం 10నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రాండ్ మాస్టర్ కె.రామిరెడ్డి శిక్షణ ఇస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు సంఘం సమావేశం

ఖిలా వరంగల్: అన్నపూర్ణ పరపతి సంఘం 23వ సర్వసభ్య సమావేశాన్ని వరంగల్ ఫోర్ట్ రోడ్డులో అన్నపూర్ణ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు బిట్ల సుధాకర్, బండి కోటేశ్వర్‌రావు, ఎనబోతుల సాంబయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులందరు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

కేవీ ఉపాధ్యాయుడికి ఎంఎఫ్ హుస్సేన్ అవార్డు



కాజీపేట అర్బన్: ఇండియన్ ఆర్ట్ సొసైటీ ఎంఎఫ్ హుస్సేన్ అవార్డును కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలోని ఆర్ట్ టీచర్ అనబత్తుల వెంకన్న అందుకున్నారు. ఈమేరకు వెంకన్నను పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ సుభాషిణి, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



దేశాయిపేట: వరంగల్ దేశాయిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30మంది గర్భిణులకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ మెడికల్ హెల్త్ కమిటీ సభ్యురాలు డాక్టర్ హరిరమాదేవి మాట్లాడుతూ గర్భం దాల్చిన సమయం నుంచి శిశువుకు జన్మనిచ్చేంత వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాలరావు, క్లబ్ ప్రతినిధులు రాజగోపాల్, వేణుగోపాల్, కృష్ణమోహన్, వెంకటనాగరాజు, వైద్యనాథ్, రమేష్‌బాబు, రాజయ్య, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'మత్తు'తో జీవితం నాశనం



మడికొండ: మత్తు పదార్థాల వినియోగంతో జీవితం నాశనమవుతుందని, ఈక్రమంలో మత్తు, పొగాకు ఉత్పత్తులకు విద్యార్థులు దూరంగా ఉండాలని ధర్మసాగర్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ సూచించారు. కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వేణుఆనంద్ అధ్యక్షతన శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో చదువుతూ ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. ఎస్సై రాజు, సీపీఓ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వం న్యాయం చేయాలి



వరంగల్: వరంగల్ జిల్లా రాంకీ విల్లాలో నివాసముంటున్న బీసీ నేత, రాజకీయ నాయకుడు నవీన్‌రాజు తనపై చేస్తున్న అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి న్యాయం చేయాలని దేశాయిపేట లక్ష్మీ టౌన్‌షిప్‌కు చెందిన బాధితురాలు అంజనీదేవి విజ్ఞప్తి చేశారు. ఎల్‌బీనగర్‌లోని డీసెంట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. నవీన్‌రాజు గతంలో తనపై అత్యాచారానికి పాల్పడిన సమయంలో స్థానిక నేత కొండా సురేఖకు వివరించగా నవీన్‌రాజ్‌తో తన వివాహం జరిపిస్తామని, లైఫ్ సెటిల్ చేస్తానని హామీ ఇచ్చి తన వద్ద ఉన్న డాక్యుమెంట్లను ఆమె తీసుకున్నారని గుర్తుచేశారు. అతడిపై అత్యాచారం కేసు కింద ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయించారని తెలిపారు. నవీన్‌రాజ్ తన పలుకుబడితో సాక్ష్యాలు లేకుండా చేసి కేసు లేకుండా చేసుకున్నాడని తెలిపారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా గెలిచిన సురేఖను కలిసి ఇప్పుడైనా న్యాయం చేయాలని కోరగా రేపు మాపు అంటూ తిప్పించుకుంటున్నారని అంజనీదేవి తెలిపారు. గత నెల 12వ తేదీన రాంనగర్‌లోని సురేఖ నివాసానికి వెళ్లి అడుగగా తనను నానా భూతులు తిట్టి పంపివేసినట్లు వాపోయారు. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా వారు పట్టించుకోవడం లేదని బాధితురాలు అంజనీదేవి ఆవేదన వ్యక్తం చేశారు.

మహంకాళి ఉత్సవాలకు ఏర్పాట్లు

● వేడుకలకు ముస్తాబైన ఆలయం

కాజీపేట: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే మహంకాళమ్మ బోనాల వేడుకకు కాజీపేటలోని ఆలయం అందంగా ముస్తాబయింది. ప్రతిఏటా ఆషాఢమాసం చివరి ఆదివారం (జూలై 28న) వైభవంగా భక్తులు ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. విష్ణుపురిలోని మహంకాళమ్మ ఆలయం నుంచి పసుపుతో మహిళలు తయారు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భక్తుల కోలాహలం, నృత్యాల మధ్య పుర వీధుల్లో భారీ ఉరేగింపు నిర్వహిస్తారు. దేవాలయ పూజారి ముత్యాలు రాజు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రథయాత్ర సాగనుంది. ఆరోజు తెల్లవారు జామునుంచే బోనాలతో భక్తులు ఉరేగింపుగా



మహంకాళమ్మ ఆలయం

వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. అమ్మవారికి పట్టు వస్త్రాలతోపాటు గాజులు, పసుపు, కుంకుమలు సమర్పిస్తారు. జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల సౌకర్యాల కోసం స్థానిక యువకులు ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. కాజీపేట పట్టణంలో అమ్మవారి ఉరేగింపు జరగనున్న ప్రాంతాల్లో వేపకొమ్మలు, మామిడి ఆకులు, రంగురంగుల కాగితాలు, ఫ్లెక్సీలతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ

గంభీరమైన శరీరం, పెద్ద మీసాలు, కాళ్లకు గజ్జెలు, ఒంటినిండా పసుపు రాసుకుని చేతిలో కొరడా పట్టుకుని నాట్యం చేసే పోతరాజుల విన్యాసాలు ఈ బోనాల పండుగ ప్రత్యేకత. జిల్లా నలుమూలల నుంచి హిజ్రాలు ఈ ఉత్సవాలకు హాజరై బోనాలు ఎత్తుకుని చేసే నృత్యాలు అందరిని ఆకట్టుకుంటాయి. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఉత్సవాల్లో కీలక భూమిక పోషించడంతో పాటు అమ్మవారిని దర్శించుకుంటారు.

కార్గిల్ అమర జవాన్లకు ఘన నివాళి



దేశాయిపేట: కార్గిల్ వీర జవాన్లకు నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు



కేయూ క్యాంపస్: ఆర్ట్స్ కళాశాలలో..



నయీంనగర్: చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో..

దేశాయిపేట: కార్గిల్ యుద్ధ అమర జవాన్లకు వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్లు శుక్రవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని నింపే కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను పండగ వాతావరణంలో నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ధర్మారెడ్డి, లైబ్రేరియన్ అనిల్, కెప్టెన్ డాక్టర్ పి.సతీష్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో విజయ్ దివస్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ ఆర్మీ కేడెట్ల ఆధ్వర్యంలో విజయ్ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన సైనికులకు నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ పుల్లా రమేష్, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ స్వామి, ఏఆర్ అశోక్‌బాబు పాల్గొన్నారు.

దేశం సత్తాచాటిన కార్గిల్ పోరాటం

నయీంనగర్: కార్గిల్ యుద్ధం జరిగి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) వరంగల్ ఆధ్వర్యంలో చైతన్య డీమ్డ్ టుబి యూనివర్సిటీలో కార్గిల్ విజయోత్సవ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్ సూరునేని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గిల్ పోరాటం తమ దేశ సైనిక సత్తాను చాటిచెప్పిందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు బహుమతులు, ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్లను చాన్స్‌లర్ పురుషోత్తంరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వీసీ జి.దామోదర్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైనికులకు అండగా నిలుద్దాం

ఖిలా వరంగల్: మాతృభూమిని రక్షించే సైనికులకు అండగా నిలుస్తూ అర్హులు సైన్యంలో చేరి దేశరక్షణ కోసం అంకితభావంతో పనిచేయాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, కర్నె రవీందర్ పిలుపునిచ్చారు. కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో భాగంగా కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని వీరజవాన్ మాడిశెట్టి సతీష్ విగ్రహానికి వారు శుక్రవారం వేర్వేరుగా నివాళులర్పించారు. నాయకులు రత్నం సతీష్‌షా, బాకం హరిశంకర్, మాచర్ల చిన్నారావు, కపిల్ కుమార్ రాజు, నాగరాజు, అర్జున్ గౌడ్, కర్నె వాసుదేవ్, బక్కి రంజిత్, ఆరె కార్తీక్ పాల్గొన్నారు.

హసన్‌పర్తి ముచ్చర్లలో..

హసన్‌పర్తి: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా హసన్‌పర్తి మండలం ముచ్చర్లలో అమర జవాన్లకు శుక్రవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానికులు ముత్తినేని రమేష్, కుమార్‌రెడ్డి, చిర్ర శ్రవణ్, వెంకటేష్, సమ్మయ్య, రణధీర్, శ్రీనివాస్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల అభ్యున్నతే ధ్యేయం

హన్మకొండ చౌరస్తా: మహిళా అభ్యున్నతే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయమని, ఇందిరమ్మ రాజ్యంలో రానున్న రోజుల్లో మహిళా సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో శుక్రవారం 51మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారి తమ నియోజకవర్గంలో చెక్కులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నిర్లక్ష్యం వలన వరంగల్‌కు నిధులు రాలేదని బీజేపీ నాయకులు అనడం సిగ్గుచేటని ఆయన అన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని

కాంగ్రెస్ రైతు పక్షపాతి



హసన్‌పర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్‌రెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండలం పెంబర్తిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో రైతాంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. బడ్జెట్‌లో అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం కల్పించినట్లు వివరించారు. సమావేశంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గాదె శ్రావణ్, మాజీ ఉప సర్పంచ్ రాజు, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్, మండల కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు బత్తుల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త



వరంగల్: సైబర్ నేరాలు, టోల్‌ఫ్రీ నంబర్ 1930, మాదక ద్రవ్యాలపై నగరంలోని 14వ డివిజన్ బాలాజీనగర్ వాసులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మామునూరు ఏసీపీ తిరుపతి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో మోసాలు జరిగితే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. మాదక ద్రవ్యాలను వాడడం వల్ల జీవితాలు నాశనమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ పులి రమేష్, ఎస్సైలు నర్సింహారావు, రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్ఎస్‌లో క్రీడాకారుల సంబురాలు



సంబురాల్లో జంగా, కోచ్‌లు, క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడాభివృద్ధికి రూ.325 కోట్ల నిధులు కేటాయించడంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఒలింపిక్స్ సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడారు. హనుమకొండ డీవైఎస్ఓ అశోక్‌కుమార్, ఒలింపిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి కైలాస్‌యాదవ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు రాజేశ్వర్‌రావు, సారంగపాణి, డీఎస్ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ, నవీన్‌కుమార్, మహ్మద్ అఫ్జల్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, ప్రశాంత్, విష్ణువర్దన్, బత్తిని జీవన్‌గౌడ్, నరేందర్, రాజు, కూరపాటి రమేష్, పలు క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

హన్మకొండ: విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి విమర్శించారు. ఈమేరకు భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్, నగర కార్యదర్శి రాకేష్, నాయకులు రాజేష్, శ్రీకాంత్, హరీష్, సంపత్, శ్రీనాథ్, విజయ్, హరీష్, లక్ష్మణ్, లలిత, అనూష, స్వాతి పాల్గొన్నారు.

కేయూ క్యాంపస్: విద్యారంగానికి బడ్జెట్‌లో ప్రభుత్వం మొండిచేయి చూపిందని ఆరోపిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట రోడ్డుపై శుక్రవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రాచకొండ రంజిత్, నాయకులు వెంకట్, మహేష్, అరుణ్, పాషా పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించకుండా తక్కువగా కేటాయించారని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ జనరల్ సెక్రటరీ మర్రి మహేష్, సాయితేజ, వంశీ, శంషొద్దీన్, నర్సింహ, గణేష్ పాల్గొన్నారు.

విద్యారణ్యపురి: విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని ఎన్నికల హామీల్లో చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం విస్మరించిందని డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్ఏ) నాయకులు విమర్శించారు. హనుమకొండలో అశోక జంక్షన్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రీకాంత్, నాయకులు అనిల్, భాను, శివకుమార్, నాగరాజు, చందన, సంతోష్, వరుణ్, అక్షిత, శ్రీహిత పాల్గొన్నారు.

దళితులపై రాష్ట్ర సర్కారు వివక్ష

మడికొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులకు భారీగా గండి కొట్టి, దళితులపై వివక్ష చూపిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈమేరకు మడికొండ చౌరస్తాలో శుక్రవారం ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి గడ్డం మహేందర్ మాట్లాడుతూ ఎస్సీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.36,750 కోట్ల నుంచి రూ.33,150 కోట్లకు తగ్గించిందని విమర్శించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ కోకన్వీనర్ తాటిరెడ్డి రవీందర్‌రెడ్డి, ఎల్కతుర్తి మండల ఇన్‌చార్జ్ పానగోటి వెంకట్‌రావు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి నాగవెల్లి గోపికృష్ణ, 45వ డివిజన్ అధ్యక్షుడు చెన్నబోయిన శివకుమార్, 64వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ నవీన్, బీజేవైఎం జిల్లా నాయకులు తక్కళ్లపల్లి నిఖిల్‌రావు, దార ధనుంజయ్, గుర్రాల రాకేష్, మాచర్ల రంజిత్, అరవింద్, శ్రీకాంత్, లక్ష్మణ్, రాజ్‌కుమార్, హరీష్ పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

బడ్జెట్లలో గిరిజనులకు అన్యాయం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

హన్మకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం జరిగిందని తెలంగాణ గిరిజన సమాఖ్య హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు శంకర్ నాయక్ విమర్శించారు. హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ల ప్రతులను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో మొదటి నుంచి గిరిజనుల పట్ల ప్రధాని నరేంద్ర మోదీ కపట ప్రేమ చూపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదివాసీ గిరిజనులకు సంపూర్ణమైన నిధులు కేటాయించలేదని వాపోయారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సమాఖ్య నిర్మాణ బాధ్యులు మద్దెల ఎల్లేష్, జిల్లా అధ్యక్షురాలు లావుడ్యా రమాదేవి, నాయకులు ఎం.భిక్షపతి, కే.వెంకటేష్, ఆర్.కుమార్, ధరావత్ అశోక్, అరుణ, మాలోత్ స్వరూప, మంగ, పవన్, డి.శివశంకర్ పాల్గొన్నారు.

నోటీసులపై ఎంహెచ్‌నగర్ వాసుల నిరసన

వరంగల్: గ్రేటర్ వరంగల్ 13వ డివిజన్ ఎంహెచ్‌నగర్ కాలనీ వాసులకు జారీ చేసిన నోటీసులపై సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి మహమ్మద్ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ 2007లో 13వ డివిజన్ దేశాయపేట, ఎంహెచ్‌నగర్ సర్వే నంబర్ 308లో నివేశన స్థలాలను వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో పేదలకు అప్పగించి పట్టాలు ఇచ్చారని గుర్తుచేశారు. 4 రోజుల క్రితం మున్సిపాలిటీ అధికారులు నోటీసులు జారీ చేశారని వాపోయారు. 21ఏళ్లుగా ఇళ్లు కట్టుకొని నివసిస్తున్న కుటుంబాలకు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దూడం సంపత్, పెండ్యాల బాబు, సాబీర్, నాగరాజు, మహేందర్, నాగుల స్వరూప, కొడూరు రజిత, సాయినాథ్, లక్ష్మి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గుడిసెవాసులు

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి

కేయూ క్యాంపస్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకుని, ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ సూచించారు. శుక్రవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ సహకారంతో ఎయిడ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో అసిస్టెంట్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీదేవి, మాదాసి కనకయ్య, శ్రీనివాస్, చందులాల్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న నారాయణ, జ్యోతి

సంక్షిప్తంగా

విద్వత్‌సభకు రాధాకృష్ణ శర్మకు ఆహ్వానం

కాజీపేట: యాదగిరిగుట్టలోని హయగ్రీవా గాయత్రి ఆశ్రమంలోని ఐనవోలు అనంతమల్లయ్య సిద్ధాంతి ప్రాంగణంలో నేటి నుంచి రెండు రోజుల పాటు జరగనున్న విద్వత్ సభకు కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మను సభకు ఆహ్వానించారు. అష్టమ వార్షిక విద్వత్సమ్మేళనంలో రాష్ట్రంలోని జ్యోతిష్య పండితులు, పురోహితులు అర్చకులు సమావేశమై రానున్న శ్రీవిశ్వాస నామ సంవత్సరంలో పండుగల తేదీలను నిర్ణయించనున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి, గౌరిభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి ఆధ్వర్యంలో విద్వత్ సమ్మేళనం నిర్వహించనున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఖిలా వరంగల్: వరంగల్ పెరకవాడకు చెందిన గటికె కొమ్మాలు అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను కాకతీయ పరస్పర సహాయక పరపతి సంఘం అధ్యక్షుడు ముత్తినేని శ్రీనివాస్, కోశాధికారి బత్తుల రమేష్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. పలువురు బాధితులను పరామర్శించారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పలువురి ఎంపిక

రామన్నపేట: నగరంలోని లాల్ బహదూర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు అధ్యక్షతన కళాశాలలోని పౌల్ట్రీ విభాగం విద్యార్థులకు శుక్రవారం హిమాలయ ఎనిమల్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని బీఎస్సీ పౌల్ట్రీ, డెయిరీ కోర్సులకు చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో హిమాలయ ఎనిమల్ హెల్త్ కేర్ సంస్థ సౌత్ ఇండియా హెచ్ఆర్ మేనేజర్ కె.ప్రదీప్, ట్రైనీ హెచ్ఆర్ వినోద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.రాజేందర్‌రెడ్డి, పౌల్ట్రీ విభాగాధిపతి విజయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు అధిక నిధుల కేటాయింపు

కాజీపేట రూరల్: ఎస్సీ కార్పొరేషన్‌కు అధిక నిధుల కేటాయింపుపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకుడు పసునూరి మనోహర్ తెలిపారు. అరుంధతి మాదిగ సంక్షేమ సంఘ సభ్యుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడులేని విధంగా ఎస్సీల అభివృద్ధికి రూ.33,124 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమలో దేవయ్య, తిరుపతి, రాజా లక్ష్మణ్, జానకీరాం, శ్రీనివాస్, లక్ష్మణ్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలి

కేయూ క్యాంపస్: పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్చువల్ అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు కోరారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో కాకతీయ యూనివర్సిటీకి బ్లాక్ గ్రాంటు పెంపుపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు నరేందర్ నాయక్, తిరుణహరి శేషు, లక్ష్మీనారాయణ, బండి శ్రీను, సదానందం పాల్గొన్నారు.

పాఠశాలలో మెహందీ వేడుకలు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో మెహందీ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని విద్యార్థులు గోరింటాకుతో తమ అరచేతులను అలంకరించుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆకుతోట రాంబాబు మాట్లాడుతూ తమ సంస్కృతి, సంప్రదాయాలను రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడిబడిలో వైద్య శిబిరం

కాశిబుగ్గ: కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి)లో విద్యార్థులకు శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా కాశిబుగ్గ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు కిరణ్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఈక్రమంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పుట్ట మోహన్, గీత, సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ పోస్టర్ల ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రంలో యూపీఎస్సీ, సివిల్ సర్వీస్ అప్టిట్యూడ్ టెస్టు ప్రిలిమినరీ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు అందుకు సంబంధించిన పోస్టర్లను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి కేయూలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ డైరెక్టర్ డాక్టర్ జగన్‌మోహన్, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ రాజ్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రణయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వృద్ధుడి అరెస్ట్

కాజీపేట: దర్గా కాజీపేట ప్రాంతంలో గంజాయిని సేవించడంతో పాటు విక్రయిస్తున్న ఎండీ.సలీమ్ (70)ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. దర్గా కాజీపేటలో ఫొటోలు, ఉంగరాలు అమ్ముకుని జీవించే సలీమ్.. బతకడానికి డబ్బులు సరిపోక గంజాయి విక్రయానికి దిగాడు. దర్గా ప్రాంతంలో ఎస్సై నవీన్ కుమార్ పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన సలీమ్‌ను తనిఖీ చేయగా అతని వద్ద 100గ్రాముల గంజాయి లభించిందన్నారు.

సీపీని కలిసిన కమాండెంట్

మామునూరు: ఇటీవల టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన రాంప్రకాశ్ శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి రాంప్రకాశ్ పూల మొక్క అందజేశారు.

డీడీఈఓలు, ఎంఈఓలను నియమించాలి

విద్యారణ్యపురి: పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు రెగ్యులర్ ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలను నియమించాలని కోరారు. ఈమేరకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమకొండకు చెందిన రవీందర్, పలు జిల్లాల బాధ్యులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

గంజాయి విక్రయదారుడి అరెస్ట్

ఖిలా వరంగల్: రహదారిపై ఎండు గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసి అతడి నుంచి 1.700గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

ప్రేరణ జాతీయ స్థాయి శిక్షణకు ఎంపిక



విద్యారణ్యపురి: గుజరాత్‌లోని వాగనగర్‌లో ఆగస్టు 4నుంచి 10వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణకు హనుమకొండ జిల్లా నుంచి ఎంపికైన ఇద్దరు విద్యార్థులను హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై శుక్రవారం అభినందించారు. పంథిని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన విద్యార్థి కర్ణకంటి అక్షయ్‌రామ్, కాజీపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన గండి వర్ష ఎంపికయ్యారని జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పంథిని పాఠశాల హెచ్ఎం ఆనందం, కాజీపేట బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు సునీత, రవీందర్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.